
# బ్రతకనేర్చినవాడు



*

= రచన: శ్రీ. భోగరాజు పేర్రాజు =

ఉద్యోగం కోసం ఖమ్మంమెట్టుకు వెడుతున్నా. బెజవాడ జంక్షన్‌లో హైద్రాబాద్ వైపుపోయే బండి కోసం నిరీక్షిస్తున్నా. రైళ్ళ రాకపోకలు వేళలు తెలిపే బోర్డుపై అంకెలు ఆ గమనపు ఆలస్యమును అంతకంతకూ హెచ్చిస్తూ చూపిస్తున్నాయి. (ఆలస్యపు గంటల సంఖ్య పెరుగుతూన్న కొద్దీ, నాలోని ఖమ్మం ఎంతో త్వరగా చేరుకోవాలనే) ఉత్సాహం అదే రేటున క్షీణించి పోసాగింది. కాళ్లు నొప్పులు పెట్టేటంతవరకూ తిరిగి, ఇక తిరగలేక ఒకచోట కూలబడ్డా.

నా ప్రక్కన ఒక యువకుడు కూర్చున్నాడు. నాటివరకూ తల్లిదండ్రుల చాటున పెరిగి, అప్పుడప్పుడే ప్రపంచపు పోకడలు తెలుసుకుంటూ, మాటిమాటికీ విస్తుపోతూన్న రోజులవి. మనిషిని చూడగానే అతని తరహా గూర్చి తెలుసుకోనగలిగే సామర్థ్యం నాటికి నాకు లేనేలేదు. చూపులకతను నీటుగా, దర్జా వుట్టిపడుతూ వున్నాడు.

'ఎంతవరకండీ?' ప్రశ్నించాడతడు ఆదరంతో.

నిడదవోలులో బయలుదేరింది మొదలు, బెజవాడ వరకు నన్నెవరూ అంత ఆప్యాయంగా పలుకరించనే లేదు.

అంత ఆదరంతో అతను పని గట్టుకొని పలకరించడంతో, నా ఇంటర్వ్యూ వార్త ఎవరెవరికి చెబుదామా అనుకుంటూన్న నేను, తటాలున చెప్పేసా 'ఖమ్మం వరకూ. ఉద్యోగానికి! ఇంటర్వ్యూకు వెడుతున్నా!' అని కళ్ళు పెద్దవిచేసి, సగర్వంగా.

'ఎంతవరకూ చదువుకున్నారు?' ప్రశ్నించాడతడు తిరిగి చిరునవ్వుతో.

చెప్పాను...

తిరిగి ఆతనే సంభాషణ కొనసాగించాడు.

'నేను బి. ఏ. వరకూ చదివానండి. ఏదో మీబోటి వారి దయవల్ల...'

'ఎంతమాట! కష్టపడి చదివి వుంటారు!' అన్నాను, అతని మాటలకు అడ్డు తగుల్తూ.

'లేదండీ ఈ రోజుల్లో మనవంటివాళ్ళకు తెలివి వున్నా, డబ్బులేక 'మట్టిలో మాణిక్యాలల్లే' వుండిపోవలసి వస్తోంది. నాకూ మీకు వచ్చినట్లే వుత్తరంవచ్చింది. ఇంటర్వ్యూకు మద్రాసు రమ్మని. వెళ్ళాలంటే చేత చిల్లిగవ్వ లేదు. ఎవర్ని పడితే వాళ్ళను బెగ్గర్సు మాదిరి చేయి చాచి అడగలేం చూడండి. ఈ మధ్య ముష్టి వాళ్ళు కొందరు చదువుకుంటున్నామనీ, పుస్తకాలకు డబ్బు లేదంటూ ముష్టి అడగటం కూడ పరిపాటయిపోయింది. అలాంటి సందర్భంలో... నానుస్తూ ఆగిపోయాడు.

కాసేపు అతవి ప్రసంగాన్ని ఎందుకో ఆపుచేసి తిరిగి కొనసాగించాడు.

'మనబోటి చదువుకున్న వాళ్ళం అటు బెగ్గర్సులా

ఆ వృత్తి స్వీకరించలేం. పోనీ మోసంచేసి ఏదో ఆరోజు గడుపుకొందామంటే ... ఎంతైనా చదువుకున్న వాళ్ళం కదాండీ? అట్లాంటి పనులకు మన అంతరాత్మ ఒప్పుకో వద్దూ? ఇలాంటి మన మధ్య తరగతి కుటుంబీకుల కష్టాలు మీలాంటివారికి మాత్రమే తెలుస్తాయి ఏమంటారు? అన్నాడు.

'అవును.' అన్నా అతనన్న ప్రతీదానికీ గంగిరెద్దులా తల వూపుతూ...ఏదో రైలు వచ్చేవరకూ ఇదో కాలక్షేపం, వుబుసుపోకకు అనుకుంటూ.

తిరిగి అతను చెప్పసాగాడు. 'నే నెరుగున్న ఫ్రెండ్సు కొంతమంది నా దీనస్థితి చూసి, నీవు ఆర్జించుకున్నప్పుడు తిరిగి తీర్చేద్దువుగానిలే, అంటూ తలో కొంత సర్ది, సుమారు 10 రూపాయలవరకూ యిచ్చారు. ఎంత వద్దన్నా వినకుండా. ఇంకా 2, 3 రూపాయలైనా లేందే, కనీసం టిక్కట్టు లేకుండా వెడదామంటే, ఈ టిక్కట్టు కలెక్టర్లను మరిపించడం మనబోటి ముక్కుకు సూటిగా పోయే అమాయకులకు చాలా కష్టం చూడండి...'

'ఇంతకూ అతను నానుండికోరేది ధనమో, ఏమిటో అనే సందేహం కలిగింది నాకు. చూడబోతే నాకన్న నీటుగా వున్నాడు. ప్రయాణంలో మాసినబట్టలూ, నేనూ...అతని కంటె బికారిగా వున్నాను. అట్టి నన్ను డబ్బు ముష్టి అడుగుతున్నాడని ఎలా అనుకోవడం? చొరవచేసి అడగడానికి మొహమాట పడుతున్నాడో యేమిటో? పోనీ నాకు నేనై ఏమైనా యిస్తే యేమను కుంటాడో?' అని నాలోనే మధనపడి___

'అయితే...' అని ఆగిపోయాను అర్థోక్తిలో.

అతను నేల చూపులు చూస్తూ 'అన్నిటి___లోను నాకన్న చిన్నవారైన మిమ్మల్ని అడగ___టానికి సిగ్గు పడుతున్నాను. అయినా అడగక తప్పడంలేదు. మీరు కూడా యేదైనా తోచిన సాయం చేస్తే, మద్రాస్ పోయి, మీ పేరు చెప్పుకొని వుద్యోగం చేసుకుంటాను.'

'అయ్యో! పాపం' అనిపించిది. నేనూ వుద్యోగానికే వెడుతున్నాను. అతనూ వుద్యోగానికే వెడుతున్నాడు. నాకు సాధ్యమయినంతలో అలాంటి నిర్ధనునికి సాయ పడితేనే, భగవంతుడు కూడా నావంటి వానిని కరుణించి ఏదో బ్రతుకు తెరువు చూపుతాడు' అనియోచించి చివరకు అతనికి ఎంతోకొంత ధన సహాయం చేయాలనుకున్నా. నిజానికి నావద్ద కూడ అట్టే ఏమీ లేదు. ఏదోవున్న చిల్లరలో ఒక అర్ధరూపాయి మాత్రం అతనికిస్తూ మీరు అన్యధా భావించకుంటే, ఈ అర్ధ రూపాయి తీసుకోండి. ఇంతకన్న నావద్ద యేమీలేదు, అని అన్నా సిగ్గుతోను సంకోచంతోను.

దానినతడు ఆప్యాయంగా అందుకుంటూ 'మన బోటి వారి కష్టాలు మనబోటివారికే తెలియాలి. కష్టనష్టాలను కళ్ళకు కట్టినట్లు కలవారికి చెప్పుకొని, కాళ్ళవేళ్లా పడ్డా, వారికరకుహృదయాలు కరగవుసుమండీ''అంటూ కృతజ్ఞతాభావంతో నాభుజం నిమురి, బెజవాడ ప్లాట్ ఫారంపై వుండే ప్రజావాహినిలో కలిసిపోయాడు.

నేనొక మంచిపని చేసానన్న సంతృప్తి నా హృదయంలో నిండిపోయింది. 'పాత్రోచిత దానం చేసాను' అని యెంతో ఆనందించాను.

చివరికి నేను యెక్కవలసిన రైలు రానే వచ్చింది. బండిలోనికి ఎక్కికూర్చున్నా. ఇంతలో జనాన్ని చొరవగా తోసుకొని ఒక ఘరానా మనిషి విసురుగా వచ్చి నా ప్రక్కనున్న యిరువురిని నావైపు నెట్టి, మోటుగా ప్రవర్తిస్తూ, యిరుకుగా నున్న ఆ సీటులోనే, చోటుచేసుకొని కూర్చున్నాడు, బలవజంతంగా. అప్పుడు పరధ్యాన్నంలో అతనిని అట్టే పరిశీలనగా చూడలేదు.

ఇంతలో ఒక కుర్రాడు రకరకాల పత్రికలు అమ్మకానికి తెచ్చాడు.

నాకు 'సినిమా రంగం' అంటే యెంతో యిష్టం. నెలనెల 60 పైసలు ఖర్చుచేసి కొనగలిగే ఆర్థికస్తోమతు లేక క్లాసులో ప్రక్కసీటులో కూర్చునే షావుకారు గారి కొడుకుకు తెలియని లెక్కలు చెప్పి, వాడు ప్రతీ నెలా కొనుక్కొన్నప్పుడు ఓమారు అడిగి పుచ్చుకొని, చూసి, ఆనందించేవాడిని.

అట్టి నా ప్రియమైన సినిమారంగం అమ్మకానికి వచ్చింది. కొనాలనేవుంది. కానీ యిక చిల్లర అంతా పోగు చేస్తే ఒక రూపాయి మాత్రమే వుంది. ఉన్న ఆ పది రూపాయలనోటు మారిస్తే యిక ఖమ్మంలో ఖర్చుల సంగతి యెలా? అని నాకు నేనే సమాధానపడి, ఆ

పుస్తకంవంక గుటకలు మ్రింగుతూ చూసి, నిరుత్సాహంతో తల మరొక వైపుకు త్రిప్పుకొన్నా.

ఇంతలో 'సినిమా రంగం' ఒకటి యివ్వవోయ్'అనే కంఠస్వరం వినిపించింది. 'ఈ కంఠస్వరం యెక్కడో విన్నట్లుందేం చెప్మా'అనుకొని పరకాయించి చూసాను. చూస్తే...యింకేముంది...

అంతకు పూర్వం నేను అర్ధరూపాయి యిస్తే పుచ్చుకున్న పెద్దమనిషే. మద్రాస్ యింటర్వ్యూకువెళ్ళాలన్న సత్యవాది. హైద్రాబాద్ పోయే బండిలో ఠీవిగాకాలుపై కాలువేసుకొని, దర్జాగా గోల్డు—ఫ్లేక్ సిగరెట్ తీసి ముట్టించి, నివాసంగా పొగలు వదులుతూ, (నేను యిచ్చిన అర్ధరూపాయితో) తాను కొన్న సినిమా రంగం విప్పి, హాయిగా చదువుకుంటున్నాడు.

ఆ దృశ్యం చూసిన నేను రాయిలా బిగిసి పోయి, మిడిగ్రుడ్లు వేసాను. నా జీవితంలో యిటువంటి సంఘటన, యింతవరకూ కానలేదు, వినలేదు. అప్పుడు నాకర్ధమయింది అతని నిజమయిన వుద్యోగం యేమిటో. అప్పుడు నాకు అర్ధమయింది, నేనెంత ఆ పాత్రదానం చేశానో.

ఇంతకీ నేను కొంతమటుక్కు అదృష్టవంతుడినే. కాదు మరి? ఇంకా కొంచెం కరుణరసం అతని సంభాషణల్లో ఒలికించి వుంటే, వున్న ఆ పది రూపాయల నోటు కాస్తా మార్చి యే రెండో మూడో చేతిలో పెట్టేవాణ్ణి. ఇంకా నయం ఆ అర్ధరూపాయతో వదిలాడు. అని సరిపెట్టుకున్నా.

ప్రస్తుతం నా వద్ద డబ్బు వున్నా, నేను కొనలేని నా అభిమాన సినిమా రంగాన్ని నా డబ్బుతో, తాను కొనుక్కొని, హాయిగా చదువుకొంటూంటే, చూస్తూ కూర్చున్నా, చేసేది లేక, అతని చర్యను మోసమే అనాలో, యాచనే అనాలో, దొంగతనమే అనాలో అర్ధంకాలా నాకు. ఏమైనా యీ కలియుగంలో అతను బ్రతక నేర్చినవాడనిపించింది.

ప్రక్కనున్న తాతగారు తనతోటి-ప్రయాణీకునితో మాటల సందర్భంలో 'యిదంతా మాయదారి ప్రపంచం బాబూ, అమాయకులకు బ్రతుకేందుకిందులో ఆవంతయైనా ఆస్కారం లేదు' అంటున్నారు మధ్య మధ్య దగ్గుతూ.





## శుభాకాంక్షలు!

కథాంజలీ! నీ జన్మదినం.
కళాకారులకే ఒక సుదినం.
కళలకే నీ జీవితం ధారపోశావు
కళాకారులనే ధన్యులుగా చేశావు.
రచయితలనే పెంపొందించావు
రచనలకే ఒక వినూత్న స్థానమిచ్చావు.
అందరి కింపుగ మసిలేవు.
అందరి మన్నన పొందేవు.
గతమంతా శ్రమించావు.
గర్వమే లేక అందరినీ మించావు.
నీ సంపాదకుడు రాఘవాచారి
నీకోసం పాటడ్డ నిగర్వాచారి.
ఒక్కచేతిమీద నడిపించాడు.
బక్కచిక్కిన నిన్ను బలిపించాడు.
జన్మదినం పురస్కరించుకుని
ఆజన్మాంతం నీ కీర్తి నుంచుకుని
చిరంజీవివై వర్ధిల్లు,
పరంజ్యోతివై ప్రజ్వరిల్లు,
ఈ జన్మదినానికివే నా శుభాకాంక్షలు.
ఏ నీజన్మదినానికైనా యివే నాకాంక్షలు

—మూర్తి